ఈ-పేపర్ తెలుగు డైలీ | 8PM

ఇయ్యాల్టి NEWS Local 2 GlobaL

https://epaper.eyyaltynews.in/

బుధవారం 26 ఆగస్టు 2026

## చికెన్ ధరలు ఢమాల్.. కిలోపై ఏకంగా భారీగా కోత!

### శ్రావణ దెబ్బతో షాపుల్లో సీన్ ఖాళీ



**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, ఆగస్టు 26:**

చికెన్ ప్రియులకు గుడ్‌న్యూస్.. ధరలు భారీగా తగ్గుముఖం పట్టాయి. గత నెలలో కిలో చికెన్ ధర రూ.340 వరకు వెళ్లగా.. ప్రస్తుతం డిమాండ్ పడిపోవడంతో రేట్లు ఒక్కసారిగా దిగొచ్చాయి. శ్రావణ మాసం నేపథ్యంలో చాలామంది మాంసాహారానికి దూరంగా ఉండటంతో చికెన్‌కు గిరాకీ తగ్గింది. మరోవైపు సరఫరా ఎక్కువగా ఉండటంతో ధరలు మరింత తగ్గుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో కిలో స్కిన్‌లెస్ చికెన్ రూ.222, డ్రెస్డ్ చికెన్ రూ.197గా ఉంది. ఎక్స్-ఫారం లైవ్ బర్డ్ రూ.100, రిటైల్ లైవ్ బర్డ్ రూ.127 వద్ద కొనసాగుతోంది. శ్రావణ మాసం పూర్తయ్యే వరకు ఇదే పరిస్థితి ఉండొచ్చని వ్యాపారులు అంచనా వేస్తున్నారు. రానున్న రోజుల్లో ధరలు మరింత తగ్గే అవకాశం ఉందని చెబుతున్నారు.

## రేవంత్ సర్కార్ ఫుల్ యాక్షన్...చేయూత లబ్ధిదారులకు

# బిందాస్ ఖబర్!

- కళ్లు కాచేలా వెయిటింగ్ ఖతం...
- వచ్చే నెల1 నుంచి పెన్షన్ల పటాకా!
- లక్షలాది గరీబోళ్ల ఖాతాల్లో పైసల్ డమాల్..
- ఒంటరి లేడీలు, కష్టజీవులకు పక్కా పండగే..
- ఫీల్డులోకి సీదా దిగుతున్న ఆఫీసర్లు!
- సందులు, గొందులు వెతికి మరీ పింఛన్..
- సీఎం మాస్ ఆర్డర్ కిరాక్!
- 3 లక్షలు దాటిన దరఖాస్తుల రచ్చ..

ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, ఆగస్టు 26: ఇగ దగ్గరున్న గుడి కాడ దండం పెట్టి వినుర్రి భాయ్... మన రేవంత్ సర్కార్ గరీబోళ్ల కోసం గిట్టుబాటయ్యే కిర్రాక్ న్యూస్ చెప్పింది. పెన్షన్ల కోసం కళ్లు కాయలు కాచేలా వెయిట్ చేస్తున్న పబ్లిక్‌కు బిందాస్ ఖబర్ వచ్చేసింది. వచ్చే సెప్టెంబర్ 1 నుంచి ఫీల్డ్‌లో సీన్ సితారే కాబోతుంది..




**పింఛన్ సీన్ కిర్రాక్.. సెప్టెంబర్ 1 నుంచి అసలు ఆట స్టార్ట్!**

ఆగస్టు ఆఖరు వరకు అప్లికేషన్లు తీసుకుని, సెప్టెంబర్ 1 నుంచి ఆఫీసర్లు సిదా ఫీల్డులోకి దిగుతున్నారు. ఒక్కో ఇల్లు తిరిగి అర్హుల లెక్క తేలుస్తరు. అధికారులకు కట్‌పాప్ ఆర్డర్ ఇచ్చిన్రు.. సందులు, గొందులు, మురికివాడలు.. ఏ మూల ఉన్నా సరే అర్హులైన పేదోళ్లకు పెన్షన్ మిస్ కావద్దని సెర్ప్ ఆఫీసర్లకు ఆర్డర్లు ఖరారైన పోయినయి.

**జనాల్ల ఫుల్ జోష్**

రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు 3 లక్షలకు పైగా అర్జీలు వస్తే, ఆఖరి తేదీ వరకు ఇంకో రెండు లక్షల ముచ్చట కూడా ఖాయంగా మారింది. సర్కార్ టార్గెట్ ఏమో 2.5 లక్షల కొత్త పింఛన్లు..ఒంటరి మహిళలు, వితంతువులకు ఫస్ట్ ప్రయారిటీ.. పక్కా ఆసరా దొరకాల్సిందే. నేత, గీత కార్మికులు, థలసీమియా, సికిల్‌సెల్ బాధితులకు ప్రాధాన్యత ఇస్తూ లిస్టు రెడీ చేస్తున్నరు. ఇగ దివ్యాంగుల ఫ్యామిలీలకు సపోర్ట్ ఇస్తున్నరు.. దివ్యాంగులు ఒకవేళ చనిపోతే రూపాయి ఆలస్యం లేకుండా వాళ్ల ఇంటోళ్లకు తురుమ్ అని పెన్షన్ బదిలీ చేయాలని సీఎం రేవంత్ సార్ ఆర్డర్ వేసిండు

**వెరిఫికేషన్ లేట్ లేకుండా.. ప్రాసెస్ పక్కా!**

పల్లెల్లో పంచాయతీ సెక్రటరీలు, పట్నంలో బిల్ కలెక్టర్లు ఫీల్డుకొచ్చి చెక్ చేస్తారు. దీంట్లో లేడీస్ గ్రూపుల సహాయం కూడా తీసుకుంటారు. మండల ఆఫీసులో లాగిన్ ద్వారా ఆన్‌లైన్ ఎంట్రీలు గుద్ది, డైరెక్ట్ కలెక్టర్ల టేబుల్ మీదికి రిపోర్టులు పోతయి. అక్కడి నుంచి సెర్ప్ హెడ్ ఆఫీస్‌లో సీఈఓ ఒకే చెయ్యడమే ఆలస్యం.. ఖాతాల్లో పైసల్ పడటమేనంట.!




అంబర్ పేటలో మిలాద్ ఉన్ నబీ ర్యాలీలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

## అంబర్‌పేటలో మిలాద్ జోష్..

### ఖాద్రీబాగ్ నుంచి అంబర్‌బాబా దర్గా దాకా భారీ ర్యాలీ!

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, ఆగస్టు 26**



అంబర్ పేటలో మిలాద్ ఉన్ నబీ ర్యాలీలో వీహెచ్

అంబర్‌పేటలో మిలాద్-ఉన్-నబీ వేడుకలు ఘనంగా జరిగాయి. ఇయ్యాల బుధవారం గోల్నాక ఖాద్రీబాగ్ మసీదు నుంచి శ్రీరమణ చౌరస్తా, పటేల్‌నగర్ చౌరస్తా, బాపునగర్ మీదుగా అంబర్‌బాబా దర్గా వరకు ముస్లిం సోదరులు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ పాల్గొని ముస్లిం సోదరులకు మిలాద్-ఉన్-నబీ శుభాకాంక్షలు తెలిపారు. శాంతి, సోదరభావం, ఐక్యతతో పండుగను జరుపుకోవడం అభినందనీయమన్నారు. అన్ని వర్గాల ప్రజలు పరస్పర గౌరవంతో కలిసిమెలిసి ఉండాలని ఆకాంక్షించారు. ర్యాలీలో ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు సైతం ముస్లిం సోదరులతో కలిసి పాల్గొన్నారు. శాంతి, సహనంతో పండుగను జరుపుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వెంకట్ బల్మూర్, ఖైరతాబాద్ అధ్యక్షుడు మోతా రోహిత్, పీసీసీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్ గౌడ్, షేక్ జమీర్ జాంగిర్ భాయ్, కమిటీ సభ్యులు సలీం భాయ్, సమీయుల్లా, మహ్మద్ ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.



కొండా ఎపిసోడ్‌లో కొత్త ట్విస్ట్.. భట్టి దగ్గరికి మురళి, రాజగోపాల్!

2 లో



నేపాల్‌లో వరద బీభత్సం.. 105 మంది భారతీయులు గల్లంతు!

2 లో



అమెరికా-ఇరాన్ వార్‌కు బ్రేక్..? సీజ్‌ఫైర్‌కు గ్రీన్ సిగ్నల్!

2 లో



మొగడి ఇల్లు అమ్మిన పైసలతో లవర్ తో జంప్..సీన్ కట్ చేస్తే !

3 లో



## మిలాద్ జోష్‌లో సేవా స్ఫూర్తి.. ఆకాశ్‌నగర్‌లో ఆమిర్ ఆధ్వర్యంలో అన్నదానం!

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, ఆగస్టు 26:**

మిలాద్-ఉన్-నబీ సందర్భంగా ఆకాశ్‌నగర్‌లో బీఆర్ఎస్ యువ నాయకుడు మొహమ్మద్ ఆమిర్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, బీఆర్ఎస్ ఉద్యమ నాయకుడు మల్లికార్జున్ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అంబర్‌పేట అంటేనే గంగా-జమునా తహజీబ్‌కు మారుపేరని అన్నారు. ప్రవక్త మహమ్మద్ బోధనలకు అనుగుణంగా మిలాద్-ఉన్-నబీ సందర్భంగా ముస్లిం సోదరులు చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆమిర్, మహమ్మద్ ఇబ్రహీం, అఫ్రోజ్, రాహుల్ ముదిరాజ్, ఫయాజ్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్-2పై కాంగ్రెస్ బూత్ లెవెల్ టీమ్‌కు ట్రైనింగ్..

### నోటీసులొస్తే జాగ్రత్తగా ఉండాలంటూ సూచనలు!

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, ఆగస్టు 26:**

నియోజకవర్గంలో చేపట్టనున్న ఎస్ఐఆర్ ఫేజ్-2 కార్యక్రమంపై కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హిమాయత్‌నగర్ డివిజన్‌లో జరిగిన ఈ ట్రైనింగ్‌లో మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్, ఎస్ఐఆర్ ఇన్‌చార్జ్ బసవరాజ్ శ్రీనివాస్, కాంగ్రెస్ ట్రైనర్ రందిర్ పాల్గొని బీఎల్ఏలకు పలు సూచనలు చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో నోటీసులు అందుకున్న ఓటర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రక్రియపై వారికి అవగాహన కల్పించే విధానాన్ని వివరించారు. హిమాయత్‌నగర్ డివిజన్‌కు

చెందిన 42 మంది బీఎల్ఏలతో పాటు కాంగ్రెస్ సీనియర్ నాయకులు జి. రామన్ గౌడ్, డివిజన్ అధ్యక్షుడు నయీమ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అఖిల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## యువతకు మోదీ కీలక సందేశం.. రేపు ‘ఖేలో ఇండియా డైలాగ్’లో దిశానిర్దేశం!

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, ఆగస్టు 26:**




జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు గురువారం (ఆగస్టు 27) దేశ యువతతో వర్చువల్‌గా ముచ్చటించనున్నారు. ఉదయం 11 గంటలకు ‘ఖేలో ఇండియా డైలాగ్--ఖేల్ కీ బాత్ ప్రధాని మోదీ కే సాథ్’ కార్యక్రమంలో పాల్గొని క్రీడలు, ఫిట్‌నెస్, యువ నాయకత్వం, సాధికారత, వికసిత్ భారత్ నిర్మాణంపై దిశానిర్దేశం చేయనున్నారు. దేశవ్యాప్తంగా 1,500కుపైగా విద్యాసంస్థల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఐఐటీలు, ఐఐఎంలు, ఎన్ఐటీలు, ఎయిమ్స్, వైద్య కళాశాలలు, విశ్వవిద్యాలయాలు ఇందులో భాగస్వామ్యం కానున్నాయి. మేరా యువ భారత్ ఆధ్వర్యంలో ప్రతి జిల్లాలో రెండు కళాశాలల్లో యువ సంవాద్ నిర్వహిస్తారు. ప్రముఖ క్రీడాకారులు మేరీ కోమ్, సైనా నెహ్వాల్, పీటీ ఉషా, దీపా కర్మాకర్, గగన్ నారంగ్, శ్రీజేష్, పుల్లెల గోపీచంద్ తదితరులు పాల్గొననున్నారు. నషా ముక్త్ యువ ఉద్యమం, క్రీడా మౌలిక వసతులు, స్పోర్ట్స్ సైన్స్, 2036 ఒలింపిక్స్ లక్ష్యాలు, భవిష్యత్ నైపుణ్యాలు, పౌర బాధ్యతలపై యువతతో ప్రధాని చర్చించనున్నారు.

## ప్రగతి భవన్‌లోకి జనానికి నో ఎంట్రీ.. ధరణితో భూ సమస్యలు పెంచారు: వీహెచ్ ఫైర్!

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, ఆగస్టు 26:**



గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బుధవారం గాంధీభవన్‌లో నిర్వహించిన ప్రజా ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్న వీహెచ్.. ప్రజలు, కార్యకర్తల నుంచి అర్జీలు స్వీకరించారు. గత ప్రభుత్వం ప్రగతి భవన్ నిర్మించి ప్రజలు తమ సమస్యలు చెప్పుకునే అవకాశం లేకుండా చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రగతి భవన్‌ను ప్రజాభవన్‌గా మార్చి సమస్యల పరిష్కార వేదికగా తీర్చిదిద్దిందన్నారు. గాంధీభవన్‌ను కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదికగా మార్చేందుకు ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి వచ్చిన అర్జీల్లో ఎక్కువగా భూ సమస్యలే ఉన్నాయని చెప్పారు. పటేల్-పట్వారి వ్యవస్థ ఉన్న సమయంలో భూ సమస్యలు తక్కువగా ఉండేవని, గత ప్రభుత్వం ధరణితో అనేక సమస్యలు సృష్టించిందని ఆరోపించారు. ఇందిరాగాంధీ పేదలకు పంచిన భూములను కొందరు భూస్వాములు తిరిగి అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నారని ఆరోపించారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో జరుగుతున్న తప్పిదాలపై రెవెన్యూ మంత్రి కఠిన చర్యలు తీసుకోవాలని వీహెచ్ కోరారు.

## ఒళ్లు దగ్గర పెట్టుకోండి.. మర్యాద దక్కదు!

### ఆంధ్రా మీడియాకు రాజగోపాల్ రెడ్డి మాస్ వార్నింగ్

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, ఆగస్టు 26:**



కాంగ్రెస్ పార్టీ అంతర్గత వ్యవహారాలు, తనపై దుష్ప్రచారం చేస్తూ వార్తలు రాస్తున్న కొన్ని ఆంధ్రా మీడియా సంస్థలపై మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో భేటీ అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన.. ఓ ప్రముఖ తెలుగు మీడియా సంస్థను ఉద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఒళ్లు దగ్గర పెట్టుకుని ఉంటే మంచిదని, లేకపోతే మర్యాద దక్కదని హెచ్చరించారు. తన ప్రతాపం చూపిస్తే ఆ ఛానల్, పేపరే ఉండదంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ కోసం పార్లమెంట్‌లో పోరాడిన చరిత్ర తమదని, తమ వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా వార్తలు రాస్తే ఊరుకునేది లేదన్నారు. మీడియా, జర్నలిస్టులంటే తనకు గౌరవం ఉందని, కానీ మీడియా ముసుగులో కొందరికి కొమ్ముకాసే వారికి మాత్రమే ఈ హెచ్చరిక అని స్పష్టం చేశారు. అవసరమైతే 100 ఛానళ్లు పెట్టే దమ్ము, ధైర్యం తమకుందని అన్నారు.

## హిజాబ్‌పై కోర్టు తీర్పు.. ఒవైసీ ఫైర్!

### “మా మతం.. నిర్ణయించేది మేమే” అంటూ ఘాటు వ్యాఖ్యలు



**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, ఆగస్టు 26:**

పాఠశాలలో హిజాబ్ ధరించేందుకు అనుమతి నిరాకరిస్తూ అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తీవ్రంగా స్పందించారు. ఈ తీర్పును ఇస్లాంపై దాడిగా అభివర్ణించిన ఆయన.. “ఇది మా మతం.. ఏది అవసరమో మేమే నిర్ణయించుకుంటాం. నిర్ణయించడానికి న్యాయమూర్తులు ఎవరు?” అంటూ ప్రశ్నించారు. ఇస్లాంలో ఏది ముఖ్యమో, ఏది కాదో నిర్ణయించడం కోర్టుల పని కాదన్నారు. హిజాబ్ మతపరమైన తప్పనిసరి ఆచారం కాదంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పు ముస్లిం బాలికల విద్యపై ప్రభావం చూపుతుందని ఒవైసీ ఆందోళన వ్యక్తం చేశారు. తీర్పు రాజ్యాంగంలోని ఆర్టికల్ 19, 25కు విరుద్ధమని ఆరోపించారు. వందేమాతరం వివాదంపైనా స్పందించిన ఆయన.. దేశభక్తి కోసం మత విశ్వాసాలను వదులుకోవాల్సిన అవసరం లేదన్నారు. “ఈ దేశం అందరిదీ” అని స్పష్టం చేశారు.

ఇయ్యాల్టి NEWS Local 2 GlobaL
https://epaper.eyyaltynews.in/
జనరల్ న్యూస్ బుధవారం 26 ఆగస్టు 2026




# స్టాక్ మార్కెట్‌లో సేల్స్ దుమారం.. సూచీలు డౌన్!

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, ఆగస్టు 26:**

అంతర్జాతీయ పరిణామాలతో మదుపర్లు అలర్ట్‌గా ఉండటంతో దేశీ స్టాక్ మార్కెట్ బుధవారం నష్టాల్లో ముగిసింది. ఐటీ, ఎఫ్ఎంసీజీ, ఆటో షేర్లలో సేల్స్ దెబ్బకు మార్కెట్‌పై ఒత్తిడి పెరిగింది. సెన్సెక్స్ 183.15 పాయింట్లు నష్టపోయి 77,472.94 వద్ద క్లోజ్ కాగా.. నిఫ్టీ 126.80 పాయింట్లు తగ్గి 24,207.75 వద్ద సెటిల్ అయింది.నిఫ్టీకి 24,400 లెవల్ కీలక రెసిస్టెన్స్‌గా ఉంది. ఇది దాటితే 24,500–24,600 దాకా జంప్ చేసే ఛాన్స్ ఉందని నిపుణులు చెబుతున్నారు. కింద 24,200 తక్షణ సపోర్ట్ కాగా.. 24,100–24,000 జోన్ బలమైన అడ్డుకట్ట. 24,150 కిందికి జారితే సేల్స్ మరింత పెరిగే అవకాశం ఉంది.భారతీ ఎయిర్‌టెల్, పవర్‌గ్రిడ్, ఇన్ఫోసిస్ షేర్లు డల్‌గా ఉండగా.. మెటల్, ప్రైవేట్ బ్యాంక్, సిమెంట్ రంగాలు మాత్రం కాస్త జోష్ చూపించాయి.

# కొండా ఎపిసోడ్‌లో కొత్త ట్విస్ట్..

## భట్టి దగ్గరికి మురళి, రాజగోపాల్!

### వేటు తప్పదన్న వేళ.. విడివిడిగా భేటీలు.. కాంగ్రెస్‌లో హాట్ టాపిక్!

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, ఆగస్టు 26:**



తెలంగాణ కాంగ్రెస్‌లో కొండా సురేఖ ఎపిసోడ్ రోజురోజుకూ హీటెక్కుతోంది. అధిష్టానం యాక్షన్ ఏంటి అన్న సస్పెన్స్ నడుస్తుండగానే.. మంత్రి భర్త కొండా మురళి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను విడివిడిగా కలవడం పొలిటికల్‌గా హాట్ టాపిక్ అయింది. ప్రజాభవన్‌లో జరిగిన భేటీల్లో తాజా పార్టీ పరిణామాలపై చర్చించినట్టు సమాచారం. భట్టితో పాటు ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా ఉన్నట్టు తెలుస్తోంది.ఇక పార్టీ లైన్ దాటారంటూ కొండా సురేఖ, చిన్నారెడ్డిపై డీఏసీ నివేదిక ఇవ్వడంతో.. వేటు తప్పదన్న చర్చ జోరందుకుంది. ఇదే టైమ్‌లో రాజగోపాల్ రెడ్డి భేటీ మరింత ఆసక్తి రేపుతోంది.భట్టి భేటీ తర్వాత కొండా మురళి మాట్లాడుతూ.. తమ బిడ్డ కొండా సుస్మిత వ్యాఖ్యలతో తమకు సంబంధం లేదన్నారు.

గాంధీ కుటుంబంపై పూర్తి నమ్మకం ఉందని, కాంగ్రెస్‌లోనే కొనసాగుతామని క్లారిటీ ఇచ్చారు. కమిటీ నిర్ణయం వచ్చే వరకు ఏం మాట్లాడబోనన్నారు.



# కౌశిక్ రెడ్డికి ఎథిక్స్ కమిటీ టెన్షన్.. 29న కీలక భేటీ!

### కడియం ఇష్యూలో విచారణ.. యాక్షన్‌పై పొలిటికల్ సర్కిల్స్‌లో హీట్!

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, ఆగస్టు 26:**

తెలంగాణ అసెంబ్లీలో కౌశిక్ రెడ్డి ఇష్యూ మళ్లీ హాట్ టాపిక్ అయింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి.. కడియం శ్రీహరిపై చేసిన అనుచిత వ్యాఖ్యలు, ప్రవర్తనపై ఈనెల 29న ఎథిక్స్ కమిటీ కీలక విచారణ చేపట్టనుంది. ఉదయం 11 గంటలకు అసెంబ్లీ కమిటీ హాల్‌లో భేటీ జరగనుంది.గత బడ్జెట్ సమావేశాల టైమ్‌లో కడియం శ్రీహరిపై కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై అధికార పక్షం అభ్యంతరం వ్యక్తం చేయడంతో.. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఈ వ్యవహారాన్ని ఎథిక్స్ కమిటీకి పంపించారు. తాజాగా విచారణను ఫాస్ట్‌ట్రాక్ చేస్తూ అసెంబ్లీ కార్యదర్శి రేండ్ల తిరుపతి అధికారిక లేఖ జారీ చేశారు. 29న కమిటీ చైర్మన్, సభ్యులు కూర్చొని ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేసి.. కౌశిక్ రెడ్డిపై తీసుకోవాల్సిన చర్యలపై సిఫారసులతో నివేదిక సిద్ధం చేయనున్నారు. మరి కమిటీ ఎలాంటి యాక్షన్ తీసుకుంటుందన్నదే ఇప్పుడు తెలంగాణ పొలిటికల్ సర్కిల్‌లో హాట్ డిస్కషన్.



# భూమి కనిపిస్తే అమ్ముడేనా... రేవంత్ సర్కార్‌పై హరీశ్‌రావు ఫైర్!

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, ఆగస్టు 26**

: కేసీఆర్ పాలన ప్రజల కేంద్రంగా సాగితే.. రేవంత్ పాలన భూముల చుట్టూ తిరుగుతోందని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు మండిపడ్డారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను రేవంత్ ప్రభుత్వం దెబ్బతీస్తోందని ఫైర్ అయ్యారు. బుధవారం కూకట్‌పల్లిలో 22-Aబాధితులతో భేటీ అయిన ఆయన.. ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు.పార్కులు, ప్లాట్లు, ప్రభుత్వ స్థలాలు.. ఎక్కడ జాగా కనిపిస్తే అక్కడ అమ్మకాలకు పెడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూములన్నీ అమ్ముకుంటే భావి తరాలకు ఏం మిగులుతుందని ప్రశ్నించారు. ప్రజల ఆస్తులను 22–ఎ నిషేధిత జాబితాలో పెడుతూ.. ప్రభుత్వ భూములను రేవంత్ సోదరుల చేతుల్లోకి నెడుతున్నారని ఆరోపించారు. లక్షల ఎకరాల అసైన్డ్ భూములను లాక్కొని పారిశ్రామికవేత్తలకు కమీషన్లకు అమ్ముతున్నారని విమర్శించారు. ఎప్పుడు హైడ్రా వస్తుందో.. ఎప్పుడు 22-A కింద జాగా పోతుందోనని జనం భయపడుతున్నారని హరీశ్‌రావు అన్నారు.



# నేపాల్‌లో వరద బీభత్సం..

## 105 మంది భారతీయులు గల్లంతు!

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, ఆగస్టు 26:**

టిబెట్ నుంచి వచ్చిన భారీ వరదలతో నేపాల్‌లో బీభత్సం నెలకొంది. భోటెకోషి నది ఉధ్ధృతికి నువాకోట్, ధాదింగ్ జిల్లాలు అతలాకుతలమయ్యాయి. ఇప్పటివరకు 8 మృతదేహాలను గుర్తించగా.. గల్లంతైన వారిలో 105 మంది భారతీయులు ఉన్నట్లు నేపాల్ టూరిజం బోర్డు వెల్లడించింది.వరద ప్రాంతాల్లో మొత్తం 384 మంది పర్యాటకులు గల్లంతైనట్లు సమాచారం. వీరిలో 291 మంది విదేశీయులు కాగా.. 93 మంది నేపాలీలు ఉన్నారు. రసువా జిల్లాలో 26 మంది నేపాల్ పోలీసులు, ఏడుగురు ఆర్మ్డ్ పోలీస్ ఫోర్స్ సిబ్బంది కూడా మిస్సయ్యారు.రెస్క్యూ ఆపరేషన్‌లో ఇప్పటివరకు 20 మందిని కాపాడారు. 15 హెలికాప్టర్లతో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. రోడ్లు, విద్యుత్ వ్యవస్థలు, హైడ్రోపవర్ ప్రాజెక్టులు భారీగా దెబ్బతిన్నాయి. పరిస్థితిపై ప్రధాని బాలేంద్ర షా అత్యవసర సమావేశం నిర్వహించి.. రెస్క్యూ, సహాయక చర్యలను ముమ్మరం చేయాలని ఆదేశించారు.

# పెళ్లయిందని పెత్తనం చెలాయించలేరు..

## కర్ణాటక హైకోర్టు క్లారిటీ!

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, ఆగస్టు 26:**



భార్య పుట్టింటికి వెళ్లాలంటే భర్త లేదా అత్తమామల అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదని కర్ణాటక హైకోర్టు స్పష్టం చేసింది. అలాగే అత్తమామలకు సేవ చేయాలని, ఇంటి పనులు చేయాలని భార్యను బలవంతం చేయలేరని తేల్చిచెప్పింది. “పెళ్లి అనేది భాగస్వామి స్వేచ్ఛను కంట్రోల్ చేసే లైసెన్స్ కాదు” అని జస్టిస్ చిల్లకూరు సుమలత వ్యాఖ్యానించారు. మెయింటెనెన్స్ కేసులో తుమకూరు ఫ్యామిలీ కోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ భర్త దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. భార్యకు నెలకు రూ.5 వేలు, మైనర్ కుమార్తెకు రూ.4 వేలు.. మొత్తం రూ.9 వేల మెయింటెనెన్స్ చెల్లించాలని ఫ్యామిలీ కోర్టు ఆదేశించింది.భార్యను వేధించారని, అదనపు డబ్బు కోసం ఒత్తిడి చేశారని.. భర్త మద్యం, జూదానికి బానిసై తనపై దాడి చేశాడని ఆమె ఆరోపించింది. ఈ నేపథ్యంలో భార్య హక్కులు, స్వేచ్ఛపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది.



# పాక్ ఆసుపత్రిలో ఘోరం.. మంటల్లో 15 మంది పసికందులు మృతి!

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, ఆగస్టు 26:**

పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లోని ప్రముఖ ప్రభుత్వ ఆసుపత్రి లో భారీ విషాదం చోటుచేసుకుంది. గైనకాలజీ విభాగం వార్డులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో.. అక్కడ చికిత్స పొందుతున్న 15 మంది నవజాత శిశువులు ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయాన్ని ఆసుపత్రి అధికార ప్రతినిధి డాక్టర్ అనీజా జలీల్ ధ్రువీకరించారు.సమాచారం అందుకున్న వెంటనే ఫైర్ సిబ్బంది, రెస్క్యూ టీమ్స్ అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చాయి. ఏసీ యూనిట్‌లోని ఆక్సిజన్ కంప్రెసర్ పేలడం వల్లే మంటలు చెలరేగి ఉండొచ్చని ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. అయితే ప్రమాదానికి అసలు కారణం, నష్టం వివరాలు ఇంకా అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.

ఘటనపై పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వెంటనే సమగ్ర విచారణ జరిపించాలని అధికారులను ఆదేశించారు. పసికందులను కోల్పోయిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# అమెరికా వీసా దరఖాస్తుదారులకు ట్రంప్ సర్కార్ షాక్!

## ప్రపంచవ్యాప్తంగా అపాయింట్‌మెంట్లు హోల్డ్.. ఇంటర్వ్యూలు రీషెడ్యూల్!

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, ఆగస్టు 26**

:అమెరికా వెళ్లేందుకు వీసా కోసం ఎదురుచూస్తున్నవాళ్లకు ట్రంప్ సర్కార్ బిగ్ షాక్ ఇచ్చింది. ప్రపంచవ్యాప్తంగా యూఎస్ వీసా అపాయింట్‌మెంట్లను తాత్కాలికంగా నిలిపివేస్తూ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే బుక్ చేసుకున్న ఇంటర్వ్యూలను కూడా రీషెడ్యూల్ చేస్తోంది.కాన్సులర్ అధికారులకు ప్రత్యేక ట్రైనింగ్ ఇవ్వడంతో పాటు.. వీసా దరఖాస్తుదారులను మరింత కఠినంగా స్క్రీనింగ్ చేసేందుకే ఈ మార్పులు చేసినట్టు అమెరికా విదేశాంగ శాఖ తెలిపింది. ప్రపంచంలోని యూఎస్ ఎంబసీలు, కాన్సులేట్ల సిబ్బందికి గ్లోబల్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ నిర్వహించనున్నట్టు వెల్లడించింది.ఇప్పటికే ఇంటర్వ్యూలు బుక్ చేసుకున్న వారికి అపాయింట్‌మెంట్లు రద్దయినట్లు ఈమెయిల్స్ పంపిస్తున్నారు. కొత్త తేదీ, టైమ్‌ను తర్వాత తెలియజేస్తామని అందులో పేర్కొన్నారు. అయితే ఈ ట్రైనింగ్ ఎంతకాలం కొనసాగుతుందో మాత్రం అమెరికా స్పష్టం చేయలేదు.





# ఆపరేషన్ సిందూర్‌లో జస్ట్ మిస్.. ఇప్పుడు హిట్ లిస్ట్‌లో స్కార్దు!

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, ఆగస్టు 26**



:ఆపరేషన్ సిందూర్‌పై మాజీ సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. పాకిస్థాన్‌లోని సర్గోధా సమీపంలోని కిరాణా హిల్స్‌పై దాడితో పాటు పీఓకేలోని స్కార్దుపైనా అటాక్ చేయాలని భారత్ భావించినట్లు ఆయన వెల్లడించారు. అయితే వాతావరణ పరిస్థితుల కారణంగా స్కార్దును వదిలేసి భోలారి ఎయిర్‌బేస్‌పై దాడి చేసినట్లు తెలిపారు.కార్గిల్‌కు దాదాపు 170 కి.మీ దూరంలో ఉన్న స్కార్దు పాక్‌కు కీలకమైన ఎయిర్‌బేస్. లేహ్‌కు కూడా ఇది సమీపంలోనే ఉంది. 1999 కార్గిల్ వార్‌లో పాక్‌కు ఆపరేషనల్ బేస్‌గా పనిచేసిన ఈ ప్రాంతం.. చైనా–పాక్ వ్యూహాత్మక సంబంధాల్లోనూ కీలకంగా ఉంది.ఆపరేషన్ సిందూర్‌లో భోలారి సహా పాక్‌లోని పలు ఎయిర్‌బేస్‌లపై భారత్ దాడులు చేసింది. ఇప్పుడు స్కార్దు కూడా హిట్ లిస్ట్‌లో ఉందన్న చర్చ.. పాకిస్థాన్‌తో పాటు చైనాకూ గట్టి సిగ్నల్‌గా మారిందని రక్షణ వర్గాల్లో టాక్ నడుస్తోంది.

# అమెరికా-ఇరాన్ వార్‌కు బ్రేక్..? సీజ్‌ఫైర్‌కు గ్రీన్ సిగ్నల్!



**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, ఆగస్టు 26**

:అమెరికా–ఇరాన్ మధ్య పెరిగిన టెన్షన్‌కు త్వరలోనే బ్రేక్ పడే ఛాన్స్ కనిపిస్తోంది. రష్యా వార్తా సంస్థ RIA నోవోస్తి కథనం ప్రకారం.. ఇరు దేశాలు కాల్పుల విరమణ ఒప్పందానికి సూత్రప్రాయంగా ఓకే చెప్పినట్లు సమాచారం. పాకిస్థాన్ సైనిక అధికారులు, ఇరాన్ భద్రతా వర్గాలను ఉటంకిస్తూ ఈ విషయాన్ని వెల్లడించింది.ఈ సీజ్‌ఫైర్‌లో హోర్ముజ్ జలసంధి ద్వారా నౌకల రాకపోకలకు ఫ్రీడమ్ ఇవ్వడం కీలక అంశంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రపంచ చమురు, ఇంధన సరఫరాకు ఈ సముద్ర మార్గం చాలా ఇంపార్టెంట్. ఇక్కడ షిప్పింగ్ మళ్లీ నార్మల్ అయితే.. గ్లోబల్ ఆయిల్ మార్కెట్‌కు భారీ ఊరట దక్కే అవకాశం ఉంది.త్వరలో ఒప్పందంపై అధికారిక ప్రకటన రావొచ్చని సమాచారం. అయితే అమెరికా, ఇరాన్ ప్రభుత్వాలు ఇప్పటివరకు దీనిపై అధికారికంగా స్పందించలేదు. సీజ్‌ఫైర్ అమల్లోకి వస్తే పశ్చిమాసియాలో టెన్షన్ తగ్గి.. అంతర్జాతీయ వాణిజ్యానికి మళ్లీ జోష్ వచ్చే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు.

# నేపాల్‌లో వరద బీభత్సం.. భారత్‌కు ఫ్లడ్ టెన్షన్!

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, ఆగస్టు 26:**



నేపాల్‌లో భోటేకోశి నది ఒక్కసారిగా ఉగ్రరూపం దాల్చడంతో ఊర్లకుఊర్లే వరదల్లో కొట్టుకుపోయాయి. వందలాది మంది గల్లంతవగా.. 100 మందికి పైగా భారతీయులు కూడా మిస్సైనట్లు నేపాల్ అధికారులు తెలిపారు. ఈ వరదల ఎఫెక్ట్ భారత్‌పైనా పడే ఛాన్స్ ఉండటంతో బీహార్, యూపీ ప్రభుత్వాలు అలర్ట్ అయ్యాయి.

నేపాల్ పరిస్థితిపై ప్రధాని నరేంద్ర మోదీ ఆ దేశ ప్రధాని బాలెన్ షాతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రాణనష్టంపై సంతాపం తెలిపిన మోదీ.. నేపాల్‌కు సాధ్యమైనంత మానవతా, సహాయక సాయం అందిస్తామని హామీ ఇచ్చారు.ఇక గండక్, నారాయణి నదుల్లో నీటిమట్టాలు పెరిగే అవకాశం ఉండటంతో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ మహారాజ్‌గంజ్, కుషినగర్ అధికారులను అలర్ట్ చేశారు. బీహార్‌లోనూ కోసి, గండక్ ప్రవాహాలపై నిఘా పెంచారు. సీఎం సమ్రాట్ చౌదరి.. కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో మాట్లాడారు. ఆరు జిల్లాలకు చీణ=ఖీ బృందాలను మోహరించారు.

# కోదాడ దగ్గర ఘోర యాక్సిడెంట్.. ఆరుగురు మృతి!

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, ఆగస్టు 26:**



సూర్యాపేట జిల్లా కోదాడ మండలం ద్వారకుంట దగ్గర తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు.. కంటైనర్ లారీని ఢీకొట్టడంతో ఆరుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. పలువురి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని సమాచారం.ప్రమాదం విషయం తెలిసిన వెంటనే సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద తీవ్రత, క్షతగాత్రుల పరిస్థితిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.గాయపడిన వారికి వెంటనే మెరుగైన వైద్యం అందించాలని సీఎస్‌ను ఆదేశించారు. అవసరమైతే క్షతగాత్రులను పెద్ద ఆస్పత్రులకు తరలించాలని.. బాధితులకు అన్ని రకాల సహాయ సహకారాలు వెంటనే అందించాలని అధికారులకు జమీా ద్వారా ఆదేశాలు జారీ చేశారు.

# మోహన్ భగవత్ ఈవెంట్‌పై... అమెరికాలో దుమారం!

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, ఆగస్టు 26**



:ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ పాల్గొననున్న న్యూయార్క్ ఈవెంట్‌పై వివాదం ముదురుతోంది. ఆగస్టు 29న మాన్‌హాటన్‌లో జరగనున్న ‘యూనివర్సల్ వన్‌నెస్ సెలబ్రేషన్’ను వ్యతిరేకిస్తున్న వారిలో న్యూయార్క్ మేయర్ జోహ్రాన్ మమ్దానీ కూడా ఉన్నారు. హిందూ అమెరికన్ కమ్యూనిటీని ఏకం చేయడం, మతాంతర ఐక్యతను ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని నిర్వాహకులు చెబుతున్నారు.మమ్దానీ వైఖరిపై అమెరికన్ సింగర్, నటి మేరీ మిల్‌బెన్ తీవ్రంగా స్పందించారు. మోదీ, బీజేపీపై వ్యతిరేకతతోనే ఈ కార్యక్రమాన్ని టార్గెట్ చేస్తున్నారని ఆమె ఆరోపించారు. మమ్దానీ, ఆయన మద్దతుదారులు కావాలంటే మాడిసన్ స్క్వేర్ గార్డెన్ అద్దెకు తీసుకుని మోదీ వ్యతిరేక ర్యాలీ చేసుకోవాలని వ్యంగ్యంగా కౌంటర్ ఇచ్చారు.అయితే ప్రైవేట్ ఈవెంట్‌ను రద్దు చేసే అధికారం తనకు ఉందో లేదో తెలియదని మమ్దానీ స్పష్టం చేశారు. భారతదేశం బహుళత్వం, లౌకికతకు ప్రాధాన్యమిచ్చే దేశమని తాను నమ్ముతున్నట్లు తెలిపారు.

ట్రెండింగ్, క్రైం
ఇయ్యాలి NEWS
Local 2 GlobaL
https://epaper.eyyaltynews.in/

# టాక్సిక్‌కు మిక్స్‌డ్ టాక్.. యష్ స్వాగ్‌కు ఫ్యాన్స్ ఫిదా!

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, ఆగస్టు 26:**




రాకింగ్ స్టార్ యష్--గీతూ మోహన్‌దాస్ కాంబోలో వచ్చిన 'టాక్సిక్' థియేటర్లలో సందడి చేస్తోంది. సినిమా చూసిన నెటిజన్లు యష్ స్క్రీన్ ప్రెజెన్స్, స్వాగ్, పెర్ఫార్మెన్స్‌కు ఫుల్ మార్కులు వేస్తున్నారు.. ముఖ్యంగా సెకండాఫ్ ఎమోషనల్ సీన్స్‌లో యష్ యాక్టింగ్ నెక్ట్స్ లెవెల్ అంటూ ఫ్యాన్స్ ట్వీట్స్ చేస్తున్నారు. డ్యూయల్ రోల్‌లోనూ అదరగొట్టాడంటున్నారు. రవి బస్రూర్ బీజీఎం మాస్ సీన్లకు పూనకాలు తెప్పిస్తోందని, సినిమాటోగ్రఫీ, గోవా విజువల్స్ అదుర్స్ అంటున్నారు. నయనతార, కియారా, హుమా, రుక్మిణి, తారా సుతారియా గ్లామర్‌తో మెప్పించారు. అయితే ఫస్ట్ హాఫ్ స్లోగా ఉందని, కథనం కొందరికి బోర్ కొట్టించిందని కామెంట్లు వస్తున్నాయి. మొత్తానికి యష్ ఫ్యాన్స్‌కు పండగే.. కానీ టాక్ మాత్రం మిక్స్‌డ్ గురూ..







## వెదికా వయ్యారమే వేరు.. యాక్టింగ్‌లోనూ అదుర్స్ !

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, ఆగస్టు 26:**

సౌత్ సినిమా ఇండస్ట్రీలో తనదైన ముద్ర వేసుకున్న వెదికా.. అందం మాత్రమే కాదు, అద్భుతమైన నటనతోనూ ప్రేక్షకుల మనసులు దోచేస్తోంది. గ్లామర్, గ్రేస్, పెర్ఫార్మెన్స్ మూడు కలిపి అమ్మడిని ప్రత్యేకంగా నిలబెట్టాయి. ఏ పాత్ర ఇచ్చినా తన స్టైల్లో పండించేస్తూ బహుముఖ ప్రజ్ఞ చూపిస్తోంది. వెండితెరపై వెదికా కనిపిస్తే చాలు.. ఫ్యాన్స్‌కు ఫుల్ ఖుషీ అంటున్నారు. మొత్తానికి టాలెంట్‌తో కెరీర్‌ను స్టెడీగా ముందుకు తీసుకెళ్తున్న ఈ బ్యూటీ క్రేజ్ మాత్రం తగ్గేదేలేదంటోంది..

## గ్లామర్ లుక్‌లో...దివ్య భారతి..!

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, ఆగస్టు 26:**

దివ్య భారతి.. ఈ పేరు ఇప్పుడు గ్లామర్ లవర్స్‌లో బాగా వినిపిస్తోంది.. తాజాగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఫొటోలో అమ్మడు సింపుల్‌గా, హుందాగా కనిపిస్తూ ఫ్యాన్స్‌ను అట్రాక్ట్ చేస్తోంది. ఎక్కడా ఓవర్ కాకుండా తనదైన స్టైల్లో మెస్మరైజ్ చేస్తోంది. అందం, యాక్టింగ్ టాలెంట్‌తో పాటు వరుస అవకాశాలు అందుకుంటూ కెరీర్‌లో ముందుకెళ్తోందని టాక్. మొత్తానికి దివ్య భారతి లేటెస్ట్ లుక్ నెట్టింట్లో మంచి బజ్ క్రియేట్ చేస్తోందిగా..


### సాన్యా అందానికి ఫిదా..

## గ్లామర్ తో అదిరే దమ్ము!

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, ఆగస్టు 26:**

బాలీవుడ్‌లో తనదైన ముద్ర వేసుకుంటున్న సాన్యా మల్హోత్రా.. స్క్రీన్‌పై కనిపిస్తే చాలు ఫ్యాన్స్ ఫిదా అవుతారు.. తన ఎక్స్‌ప్రెషన్స్, నేచురల్ యాక్టింగ్‌తో ప్రతి సీన్‌కు ప్రాణం పోస్తోంది. గ్లామర్‌తో పాటు నటనలోనూ తన టాలెంట్ చూపిస్తూ ఇండియన్ సినిమాలో బహుముఖ నటిగా గుర్తింపు తెచ్చుకుంటోంది. ముఖ్యంగా తన ఆన్‌స్క్రీన్ మూమెంట్స్ సోషల్ మీడియాలోనూ మంచి బజ్ క్రియేట్ చేస్తున్నాయి. మొత్తానికి అందం, అభినయం రెండింట్లోనూ సాన్యా దూసుకుపోతుందిగా!





## టాక్సిక్‌లో హద్దులు దాటిన రొమాన్స్.. ఫ్యామిలీతో చూడాలంటే కష్టమే నంట!

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, ఆగస్టు 26:**

యష్ హీరోగా, కియారా అద్వానీ హీరోయిన్‌గా గీతూ మోహన్‌దాస్ తెరకెక్కించిన 'టాక్సిక్'లిలిపై నెట్టింట మిక్స్‌డ్ టాక్ నడుస్తోంది. భారీ యాక్షన్ మూవీగా ఆగస్టు 25న ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ సినిమాపై కేజీఎఫ్ తర్వాత భారీ అంచనాలు ఉండగా..ఇదిలా ఉంటే సినిమాలోని బోల్డ్ రొమాంటిక్ సీన్లపై సోషల్ మీడియాలో ట్రోలింగ్ షురూ అయింది. యష్--కియారా మధ్య వచ్చే కొన్ని సన్నివేశాలపై నెటిజన్లు రకరకాల కామెంట్లు పెడుతున్నారు. "వీళ్లు నటించారా.. జీవించారా?" అంటూ కొందరు సెటైర్లు వేస్తుంటే, ఫ్యామిలీ ఆడియన్స్‌కు ఈ సీన్లు ఇబ్బందిగా ఉన్నాయంటూ మరికొందరు అంటున్నారు. మొత్తానికి టాక్సిక్ యాక్షన్ కంటే బోల్డ్ సీన్లతోనే సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అయింది..




## ఇరుముడికి మెగా కాంప్లిమెంట్.. రవితేజ టీమ్‌కు రామ్ చరణ్ స్వామి శరణం!

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, ఆగస్టు 26:**

మాస్ మహారాజా రవితేజ--ప్రియ భవాని శంకర్ జంటగా వచ్చిన 'ఇరుముడి' మంచి టాక్‌తో దూసుకుపోతోంది.. సినిమా సక్సెస్‌పై మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ స్పందిస్తూ.. రవితేజతో పాటు మొత్తం చిత్రబృందానికి కంగ్రాట్స్ చెప్పాడు. టీమ్ పడిన కష్టానికి ఈ విజయం నిదర్శనమని ప్రశంసించాడు. దర్శకుడు శివ నిర్వాణ, మ్యూజిక్ డైరెక్టర్ జి.వి. ప్రకాష్, మైత్రీ మూవీ మేకర్స్‌తో పాటు టోటల్ టీమ్‌కు మరిన్ని సక్సెస్‌లు రావాలని కోరుకున్నాడు. చివర్లో 'స్వామి శరణం' అంటూ తన విషెస్ తెలిపాడు. చరణ్ అభినందనలపై శివ నిర్వాణ, జి.వి. ప్రకాష్ స్పందిస్తూ థ్యాంక్స్ చెప్పారు. మొత్తానికి రవితేజ హిట్‌కు మెగా కాంప్లిమెంట్ పడింది!

### చిత్తుగ తాగి ముగ్గురు ఆడక్కల రచ్చ..

## యువకులపై దాడి.. జైలుకు!

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, ఆగస్టు 26:**



ఏపీ రాజమండ్రిలో ముగ్గురు మహిళలు మద్యం మత్తులో నడిరోడ్డుపై హల్‌చల్ చేసిన ఘటన కలకలం రేపింది. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ఆలయం దగ్గర ఈ ఘటన జరిగింది. మద్యం సేవించి వచ్చిన మహిళలు రోడ్డుపై వెళ్తున్న ఇద్దరు యువకులతో అనవసరంగా గొడవకు దిగారు. మాటామాటా పెరగడంతో బహిరంగంగానే యువకులపై దాడికి దిగడంతో అక్కడ గందరగోళం నెలకొంది. బాధిత యువకులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు ముగ్గురిపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు.




## బిగ్ బాస్ హౌస్‌లో జబర్దస్త్ జోడి.. రామ్ ప్రసాద్, పొట్టి నరేష్ ఎంట్రీ ఫిక్సా?

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, ఆగస్టు 26:**

తెలుగులో బిగ్ క్రేజ్ తెచ్చుకున్న 'బిగ్ బాస్' ఇప్పటికే తొమ్మిది సీజన్లు కంప్లీట్ చేసుకుని.. పదో సీజన్‌కు రెడీ అవుతోంది.. ఈసారి హౌస్‌లోకి ఎవరు వస్తారన్న దానిపై రోజుకో గాసిప్ బయటకొస్తోంది. తాజాగా జబర్దస్త్ కమెడియన్స్ రామ్ ప్రసాద్, పొట్టి నరేష్ పేర్లు గట్టిగా వినిపిస్తున్నాయి. ఇద్దరూ బిగ్ బాస్ హౌస్‌లోకి ఎంట్రీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు టాక్ నడుస్తోంది. వీళ్లిద్దరూ వస్తే కామెడీకి కొదవ ఉండదని బిగ్ బాస్ ఫ్యాన్స్ అంటున్నారు. ఎంటర్టైన్మెంట్‌తో పాటు షో టీఆర్పీ కూడా దుమ్మురేపే ఛాన్స్ ఉందని అంచనా. అయితే నిజంగానే ఈ ఇద్దరూ హౌస్‌లో అడుగుపెడతారా అనేది మాత్రం అధికారిక ప్రకటన వచ్చేదాకా సస్పెన్సే గురూ!

## మొగడి ఇల్లు అమ్మిన పైసలతో లవర్ తో జంప్..సీన్ కట్ చేస్తే !

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, ఆగస్టు 26:**

కర్ణాటక సరిహద్దు గ్రామం గుమ్మళాపురంలో దారుణం జరిగింది. భార్య విద్య మరో వ్యక్తితో వెళ్లిపోవడంతో భర్త నారాయణస్వామి తీవ్ర ఆగ్రహానికి గురయ్యాడు. అప్పులు తీర్చేందుకు ఇంటిని రూ.22 లక్షలకు అమ్మి.. మిగిలిన రూ.5 లక్షలను భార్య ఖాతాలో వేశాడు. ఆ తర్వాత ఆమె ప్రియుడు పునీత్‌తో కలిసి ఆనేకల్‌కు వెళ్లిపోయింది. సోమవారం డబ్బుల కోసం గ్రామానికి వచ్చిన విద్యతో నారాయణస్వామి బ్యాంకు దగ్గర గొడవకు దిగాడు. డబ్బులు తిరిగివ్వాలని, ఆస్తిని పిల్లల పేరుమీద పెట్టాలని వాగ్వాదం జరిగింది. మాటామాటా పెరగడంతో ఆమెను బయటకు లాక్కొచ్చి బండరాయితో తలపై కొట్టి చంపేశాడు. అనంతరం పరారైన నారాయణస్వామిని పోలీసులు అరెస్ట్ చేశారు. తల్లి చనిపోవడం.. తండ్రి జైలుకెళ్లడంతో ముగ్గురు పిల్లలు దిక్కులేనివారయ్యారు.



### కృతి యాడ్‌పై దుమారం..

## గివా కీలక నిర్ణయం!

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, ఆగస్టు 26**



: బాలీవుడ్ నటి కృతి సనన్ నటించిన రక్షాబంధన్ యాడ్‌పై వివాదం ముదురుతోంది. కృతి వస్త్రధారణ, రక్షాబంధన్‌ను చూపించిన తీరుపై సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తాయి. దీనిపై బాలీవుడ్ నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ తీవ్ర వ్యాఖ్యలు చేయగా.. కృతి సనన్ గట్టిగానే కౌంటర్ ఇచ్చారు.ఈ వివాదంలోకి కాంగ్రెస్ నేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఎంట్రీ ఇవ్వడంతో వ్యవహారం రాజకీయ రంగు పులుముకుంది. కృతికి మద్దతుగా స్పందించిన రాహుల్.. ఆమె దుస్తులు ఆమె వ్యక్తిగత ఇష్టమని వ్యాఖ్యానించారు.వివాదం ముదరడంతో గివా జువెలరీ కీలక నిర్ణయం తీసుకుంది. సదరు ప్రకటనను అన్ని మీడియా వేదికల నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించింది. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను తాము గౌరవిస్తామని.. ఎవరి మనోభావాలనూ దెబ్బతీయడం తమ ఉద్దేశం కాదని సంస్థ స్పష్టం చేసింది.

ON BEHALFOF RRR MEDIA PVT LIMITED ..2-3-606/49/4.. PATELNAGER.. AMBER PET, HYDERABAD, TELNGANA.. 500013,
EDITOR: RAMANRAJU RATHNA, RNI NO TG/2024/1093.. email:ramannews9@gmail.com..phon 9949152838, 7013794396